క్లుప్తంగా

మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ



మిడ్జిల్: మండల కేంద్రంలో ఎంపీ నిధులతో నిర్మించనున్న మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. పేదలకు ప్యూరిఫైడ్ వాటర్ అందించేందుకు వాటర్ ప్లాంట్ మంజూరు చేసిన ఎంపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి, నాయకులు శ్రీనువాస్‌రెడ్డి, గౌస్, వెంకటయ్య, బాల్‌రెడ్డి, రాజేశ్వర్, తిరుపతి, నరేష్‌నాయక్, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, భీమయ్య, మల్లయ్య, శేఖర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా విద్యాసాగర్‌రెడ్డి



మహమ్మదాబాద్: మహమ్మదాబాద్ తహసీల్దార్‌గా విద్యా సాగర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. భూ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రైతులను ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు.

బాధితుడికి పరామర్శ



భూత్పూర్: బీఆర్‌ఎస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్ అనారోగ్యానికి గురి కావడంతో హైదరాబాద్‌లోని సీటీ న్యూరో ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. శంకర్ నాయక్ బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రికి తరలించి ఆపరేషన్ చేయించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. మున్సిపల్ మాజీ కౌన్సలర్ బాల్‌కోటి రూ.25వేలు, భట్టుపల్లి మాజీ సర్పంచ్ ఆంజనేయులు రూ.5వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, రామునాయక్, ఫసియొద్దీన్, తదితరులు ఉన్నారు.

బ్లాక్ ఫిల్మ్ వాడితే కఠిన చర్యలు



మహబూబ్‌నగర్ క్రైం: ట్రాఫిక్ పోలీసులు బుధవారం పాలమూరు పట్టణంలో బ్లాక్ ఫిల్మ్ వాహనాలపై ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ భగవంతురెడ్డి ఆధ్వర్యంలో నిషేధిత బ్లాక్ ఫిల్మ్ వాడుతున్న కార్లను తనిఖీ చేశారు. తనిఖీలో కారులకు బ్లాక్ ఫిల్మ్ వాడుతున్న వాటిని గుర్తించి జరిమానా విధించడంతో పాటు వాటిని తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మోటారు వాహనచట్టం ప్రకారం కార్ల డోర్ అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేయడం నేరమని, ఇలాంటి ముసుగులో అనేక నేరాలు జరుగుతున్నట్లు తెలిపారు. కారు యాజమానులు ఎవరూ నిషేధిత బ్లాక్ ఫిల్మ్ వాడరాదని, ఒకవేళ వాడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్‌టీఆర్‌కు నివాళి

జడ్చర్ల టౌన్: సినీనటుడు, మాజీ సీఎం స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి పురస్కరించుకుని బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ చౌరస్తాలో ఆయన అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఎన్‌టీఆర్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ ఎస్. రమేష్, ఎన్‌టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, వెంకటయ్య, వసుంధర శ్రీను, పరమటయ్య, బాల్‌చెన్నయ్య పాల్గొన్నారు.

పట్టణంలో మోస్తరు వర్షం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం 6.15 గంటల నుంచి 6.45 గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆ తర్వాత నుంచి అర్ధరాత్రి వరకు ముసురుతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. ఇక విలీన గ్రామాల్లో మట్టి రోడ్లన్నీ బురదగా మారాయి. దీంతో రోడ్లపై వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- సీనియర్ సిటిజన్స్ ఫోరం సమావేశ హాల్‌కు శంకుస్థాపన
- ఈ ఏడాది నుంచే పాలమూరు ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలు



సీనియర్ సిటిజన్స్ ఫోరం సమావేశ హాల్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలో నిర్మించనున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం సమావేశహాల్‌కు బుధవారం భూమిపూజ చేశారు. అంతకుముందు 'మహబూబ్‌నగర్ ఫస్ట్ – నవరత్నాలు' ఆధ్వర్యంలో టెట్, డీఎస్సీ పరీక్షల కోసం శిక్షణ తీసుకుంటున్న సుమారు 250 మంది అభ్యర్థులకు క్యాంప్ కార్యాలయంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. అనంతరం నారాయణపేట ఎమ్మెల్యే డా.పర్ణికారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజన్ 2047లో భాగంగా మహబూబ్‌నగర్‌ను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా సుమారు రూ.ఐదు వేల కోట్లతో నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. విద్యాపరంగా ఈపాటికే పాలమూరు యూనివర్సిటీ ప్రాంగణంలో లా, ఇంజినీరింగ్ కళాశాలలను తెచ్చుకున్నామన్నారు. తాజాగా ఐఐఐటీకి సంబంధించిన జీఓ నం.24 జారీ అయిందన్నారు. ఈ కళాశాల మంజూరుతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివిన మెరిట్ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ ఏడాదే బాసర ఐఐఐటీకి అనుబంధంగా స్థానికంగా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి కోసం రూ.220.94 కోట్లు మంజూరయ్యాయన్నారు.మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను ఒక క్లస్టర్‌గా రూ.736 కోట్లతో ప్రాజెక్టు తయారు చేశామన్నారు. అన్ని రకాల విశ్వ విద్యాలయాలు, రోడ్లు, వైద్యం, డ్రైనేజీలతో పాటు అన్ని మౌలిక సదుపాయలు కల్పించినప్పుడే శాశ్వతమైన అభివృద్ధి సాధ్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీజే బెన్‌హర్, అవేజ్, రమేష్‌యాదవ్, గుండా మనోహర్, సుధాకర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు జగపతిరావు, నాగభూషణం, ఎ.రాజసింహుడు, బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్‌ఓసీల అందజేత

ఇక జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ ఖలీఫా, ఒమర్ ఫరూఖ్, ఖుదిసియాబేగం అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితులకు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షలతో పాటు మహబూబ్‌నగర్ మండలం ఫతేపూర్‌కు చెందిన సల్మాన్ కోసం రూ.35 వేలు విలువజేసే ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.

ధాన్యం కొన్న వెంటనే లోడింగ్ చేయాలి

- కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్



గురుకుంటలో వరి ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

నవాబుపేట: ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే లోడింగ్ చేసి మిల్లులకు పంపించాలని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. బుధవారం ఆమె మండలం లోని గురుకుంట, కొల్లూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కొన్న వెంటనే వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యానికి సంబంధించి గన్నీ బ్యాగులు, కవర్లు తదితర వాటిని అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. గురకుంట కొనుగోలు కేంద్రంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం తేమను ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల ధాన్యం విషయంలో వెంటనే ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసి రైతులకు బిల్లులు త్వరగా వచ్చేలా చేయాలన్నారు. లారీల కొరత, మిల్లర్ల సమస్యలపై ఆమె సిబ్బందితో, అక్కడున్న రైతులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం గురుకుంట ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసి మొలకెత్తిన ధాన్యంపై ఆమె ఆరా తీశారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీఓ జీవరత్నం, సిబ్బంది ఉన్నారు.

'మోతాదుకు మించి రసాయనాలు వాడొద్దు'



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సదయ్య

హన్వాడ: పంటలకు మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు సదయ్య, దివ్యరాణి సూచించారు. బుధవారం మండలంలోని బుద్దారం రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక దిగుబడులు అందించే నూతన వంగడాలను వివరించారు. ముఖ్యంగా యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడకం వల్ల కలిగే నష్టాల గూర్చి, భూగర్భ జలాల పరిరక్షణ, సాగునీటి వినియోగం, విత్తన కొనుకోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చెట్లపెంపకం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంట రుణాలపై ఎల్‌డీఎం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు లైసెన్స్‌డ్ డీలర్ల ద్వారానే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రశీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఏడీఏ శ్రీనివాసులు, ఏఓ కిరణ్‌కుమార్, ఉద్యానవన అధికారిణి స్వప్న, వెటర్నరీ అసిస్టెంట్ అరుణ్, లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్, ఏఈఓలు శిరీష, నాగన్న, గోవింద్, భరత్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాదానం మహాదానం



విద్యార్థినికి సైకిల్‌తో పాటు స్పోర్ట్స్ డ్రస్సును అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- పీటీఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు, డ్రస్సులు, ప్రాక్టికల్ సామగ్రి అందజేత
- అభినందించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: విద్యా దానం మహాదానమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ అన్నారు. ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలం కేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీహెచ్‌ఎస్ బాలర పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు, డ్రస్సులు, ప్రాక్టికల్ సామగ్రిని ఎమ్మెల్యే సమక్షంలో అందజేశారు. 50 మంది విద్యార్థులకు సైకిళ్లు, 100 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్సులతో పాటు 50 వేల విలువ చేసే స్కూల్‌కు ప్రాక్టికల్ సామగ్రిని అందజేశారు. విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చదువుతోనే సమాజంలో ఏమైనా సాధించవచ్చని చెప్పారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం వారికి సైకిళ్లు అందజేయడం సంతోషకరమని అన్నారు. దీంతో పాటు సెక్యూరిటీలో భాగంగా ఎనిమిది సీసీ కెమెరాలు, ఆర్వో యూనిట్, రెండు కంప్యూటర్లు, ఐదు బీరువాలు మొత్తం రూ.5 లక్షల విలువ చేసే వస్తువులను అందజేసినట్లు నిర్వాహకులు కందగట్ల వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీటీఏ వ్యవస్థాపకుడు రవి ప్రకాష్‌మేరెడ్డి, ఎంఈఓ ఆర్.జనార్దన్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వి.జనార్దన్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటాం



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. వింజామూర్ గ్రామానికి చెందిన గద్వాల కొండప్ప కొద్దినెలల క్రితం క్యాన్సర్ వ్యాధితో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి బుధవారం కొండప్ప కుమారుడు రామకృష్ణకు రూ.30వేల చెక్కు అందజేశారు. నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, ఉన్నారు.

ప్రారంభమైన అయ్యప్ప ప్రీమియర్ లీగ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సమితి జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పాలమూరు ఆధ్వర్యంలో 'అయ్యప్ప ప్రీమియర్ లీగ్' (ఏపీఎల్) బుధవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ముందుగా అయ్యప్పస్వామి పూజ, హనుమాన్ చాలీసా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడాజట్లు తమ ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో దీక్ష ప్రచార సమితి సభ్యులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఫలితాలు

అయ్యప్ప ప్రీమియర్ లీగ్‌లో కార్పొరేషన్ పరిధిలో అయ్యప్ప మాలధారులు, భక్తులతో 32 జట్లు పాల్గొంటున్నాయి. మొదటి రోజు ఏడు మ్యాచ్‌లు ఆడగా అనిల్ లెవన్, యాదయ్య లెవన్, వీపీటీ లెవన్, రాహుల్ వీపీటీ, స్వర్ణకార్ లెవన్, డీజీ బాయ్స్, పంచముఖి లెవన్ జట్లు విజయం నమోదు చేసుకున్నాయి. ఈనెల 30వరకు అయ్యప్ప ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తారు.

కూచూర్‌లో దేవతావిగ్రహాల ప్రతిష్ఠాపన



నవాబుపేట: మండలంలోని కూచూర్‌లో బుధవారం నూతన దేవాలయ ప్రారంభం, నూతన దేవతావిగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభించారు. గ్రామంలో వేదమంత్రాలతో మార్మోగింది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో హోమం, అగ్నిస్థాపన నిర్వహించారు. గురువారం జల, ధాన్య దివాసాలు చేసి శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తారు. కార్యక్రమంలో నిర్వాహకులు బోజయ్య, రవి, నారాయణ, సురేష్, గోపాల్, యాదగిరి, సంతోష్, నర్సింహగౌడ్, సంజీవరెడ్డి, నాగిరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

భూత్పూర్: 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవాని, వ్యవసాయాధికారులు రైతులు పండించే పంటలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇస్తారని, మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తిని కొనసాగిద్దాం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణలో గోల్కొండ పత్రికను నడిపించి పత్రిక రంగానికి బాటలు వేసిన సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తిని కొనసాగిద్దామని మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేంద్రచారి అన్నారు. 129 జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణలో పండితులే లేరని ఆంధ్ర ప్రాంతం వారు అవహేళన చేస్తే తెలంగాణకు చెందిన 150 మంది కవులతో వనపర్తిలో కవి సమ్మేళనం నిర్వహించి తెలంగాణసాహితీ కీర్తిని ఆయన ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైసమ్మ ఉత్సవాలకు ఆర్థిక సాయం

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మైసమ్మ ఆలయ ఉత్సవాలకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోదరుడు భాస్కర్‌రెడ్డి బుధవారం రూ.10 వేలు ఉత్సవ కమిటీ నిర్వాహకులకు అందజేశారు.

ప్రభుత్వ బడిలో చేర్పించాలని ప్రచారం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. యువజన సంఘం అధ్యక్షుడు ఉందెకోడ్ కృష్ణ, ఒప్పంద ఉపాధ్యాయుడు సీజీ.మధుసూదన్‌తో పాటు మరి కొందరు యువకులు రెండు రోజులుగా మూసాపేట, సంకలమద్ది, బంగ్లగడ్డలో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థుల బ్యానర్లను ప్రదర్శిస్తూ తల్లిదండ్రులను కలుస్తున్నారు. ప్రభుత్వ బడిలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడికే పంపాలని కోరుతున్నారు. సర్కారు బడిలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, దుస్తులు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని, దీనివల్ల ఆర్థిక భారం తగ్గుతుందని తల్లిదండ్రులకు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేందర్‌గౌడ్, సుశీల్, తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందిస్తున్న శశికళ, చైర్‌పర్సన్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను ఎమ్మెల్యే మాతృమూర్తి శశికళ, మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అందజేశారు. ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గుపోసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ ఖాజామైనొద్దీన్, వార్డు అధికారి శివప్రసాద్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మల్లికార్జున్, పద్మ, లక్ష్మమ్మ, సత్యనారాయణ, తైసిన్, నాయకులు ఎర్ర ఆనంద్, అరవిందమ్మ, అనిత, స్వప్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభం

మిడ్జిల్: మండలంలో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ నిర్మాణం పనులను బుధవారం మండలంలోని రాణిపేట, వస్పుల, చిల్వేర్, వెలుగొమ్ముల గ్రామాలలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి ప్రారంభించారు. ఇండ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏఈ విజయ్‌కుమార్, నాయకులు గౌస్, అల్వాల్‌రెడ్డి, సాయిలు, ప్రశాంత్‌రెడ్డి, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీధర్, మల్లేష్, సత్యం, కృష్ణారెడ్డి, శ్రీధర్, రవీందర్‌రెడ్డి, రాజవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నవాబుపేట: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి సొంతింటి కలలు నెరవేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం తెలిపారు. బుధవారం మండలంలోని గురుకుంట, కాకర్జాల్‌తండా, దర్పల్లి, అమ్మపూర్, కిషన్‌గూడ, పుట్టోనిపల్లి తండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందించి పనులు ప్రారంభించారు. త్వరలో రెండో విడత సైతం ఇళ్లు మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠ, నవాజ్‌రెడ్డి, రాజశేఖర్, ప్రభాకర్, సంతోష్‌నాయక్, గోపాల్, రాము, రమేష్‌గౌడ్, శ్రీహరి ఉన్నారు.

సినీ హీరో కృష్ణ విగ్రహం పెట్టొద్దు

- విగ్రహం పెడితే ఉద్యమిస్తాం
- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ నాయకుడు మైత్రి యాదయ్య

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆంధ్ర సినీ హీరో కృష్ణ విగ్రహాన్ని జిల్లా కేంద్రం పాత డీఈఓ కార్యాలయం చౌరస్తాలో ఎట్టి పరిస్థితిలో పెట్టనిచ్చేది లేదని, వివిద ప్రజా సంఘాల నాయకులు తేల్చి చెప్పారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బుద్ధభవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకులు మైత్రి యాదయ్య మాట్లాడుతూ ఆంధ్ర సినీ హీరో కృష్ణకు తెలంగాణకు ఎం సంబంధమని ప్రశ్నించారు. తెలంగాణ కోసం పోరాటం చేసి తొలి ప్రాణ్యత్యాగం చేసిన పోలీస్ కిష్టయ్య, సువర్ణ విగ్రహాలను అనుమతించని కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్ర నాయకుడి విగ్రహానికి ఎట్లా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. పండుగ సాయన్న, జ్యోతిరావు పూలే విగ్రహాలు పెడుతామంటే అనేక ఆంక్షలు పెట్టారన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. సాజిదా సికిందర్ మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాటం చేశారా? లేక పోరాటానికి మద్దతు తెలిపారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా కోకన్వీనర్ గోపాలకృష్ణ, నాయకులు మాణిక్‌రావు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు రాము, నవీన్, బుర్రసురేష్, మాదిగ జేఏసీ నాయకులు రామలింగం, దళిత సేన నాయకులు అరుణ్, ప్రైవేట్ ఆస్పత్రుల సంఘం నాయకులు రాములు, ఇంటలెక్చువల్ ఫోరం తిరుపతయ్య, మొగులయ్య, శ్రీను, సీతారాంనాయక్, నగేష్ పాల్గొన్నారు.

నేడు హజ్రత్ పకీర్లషాఖాద్రీ దర్గా గంధోత్సవం



వనపర్తి రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఉర్సులో పెబ్బేరు మండలంలోని కొత్త సూగూరు గ్రామం ఒకటి. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే అతిపెద్ద ఉర్సు హజ్రత్ పకీర్ల షాఖాద్రీ రహ్మతుల్లా దర్గాలో గురువారం రాత్రి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకలకు గ్రామ పంచాయతీ, దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు దర్గాను సందర్శించి, మొక్కులు ఉన్నవారు కోళ్లు, మేకలు, పొటేళ్లు బలిచ్చి కందూర్లు చేస్తారు. 29న పాత సూగూరు తాలిబ్ షా మౌలాఖాద్రీ దర్గాలో రాత్రి 7 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణతో గంధోత్సవ ఊరేగింపు ప్రారంభం అవుతుంది. అర్ధరాత్రి రాత్రి 12 గంటలకు కొత్త సూగూరు దర్గాకు చేరుతుంది. 30న దర్గా ఆవరణలో రాత్రి 10 గంటలకు (దీపారాధన) ప్రముఖ గాయకులతో ఖవ్వాలీ నిర్వహిస్తారు. 31న ఉదయం 7 గంటలకు ఫజర్ నమాజ్ తర్వాత ఖత్మే ఖురాన్, ఫాతేహాలతో ఉర్సు ముగుస్తుందని దర్గా 12వ పీఠాధిపతి సయ్యద్ సైపొద్దీన్ తెలిపారు.